క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని గృహ నిర్మాణ పనుల్లో మరింత పురోగతి కనిపించాలన్నారు. పనులు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణ పనులు చేపట్టేలా చూడాలని సూచించారు. రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల వినతి



వినతిని స్వీకరిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: తమకు న్యాయం చేయాలంటూ పంచాయతీ పరిధిలో విధులు నిర్వహించే గ్రీన్ అంబాసిడర్లు ఎంపీడీవో గౌరీకి విన్నవించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆమెను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రెండు సంవత్సరాలుగా సక్రమంగా జీతాలను చెల్లించడం లేదని మండలంలోని గ్రీన్‌అంబాసీడర్లు, గ్రీన్‌గార్డ్‌లు అందరు కలిసి ఎంపీడీవోకు విన్నవించారు. ప్రతి నెలా రూ.6వేలు వేలు చొప్పున అందించడం వల్ల కుటుంబ పోషణకు సరిపోక అప్పులు చేస్తున్నారని చెప్పారు. ఈ పనిని నమ్ముకొని 70 కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు ఎంపీడీవో గౌరి వారికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో చిలకమ్మ, పూర్ణ, కృష్ణమూర్తి,గిరి, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



చేప పిల్లలను వదులుతున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: మండలంలో మలేరియా, డెంగ్యూ లాంటి విషజ్వరాలు ప్రబలకుండా దోమల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత తెలిపారు. వి.యస్.అగ్రహారంలో సోమవారం దోమల వల్ల కలిగే వ్యాధులు, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అగ్రహారం, గోవిందరెడ్డిపల్లె, బీరప్పచెరువు, గొల్లపల్లె చెరువులో దోమ లార్వాల నియంత్రణకు గంబూజియా చేప పిల్లలను వదిలారు. సీహెచ్ఓ సుగుణవతి, హెల్త్ సూపర్‌వైజర్ జయశంకర్, ఎల్‌డీసీ ఉమాపతి, ఏఎన్ఎం షాహిన పాల్గొన్నారు.

స్పందనలో అర్జీల వెల్లువ



అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్

పూతలపట్టు: స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలతో అర్జీలు వెల్లువెత్తాయి. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని తహసీల్దార్ విజయభాస్కర్ నిర్వహించారు. మండలవ్యాప్తంగా బాధితులు అర్జీలను తహసీల్దార్‌కు అందించారు. ముఖ్యంగా మ్యూటేషన్, జనన, మరణ ధ్రువపత్రాలు, రేషన్‌కార్డుల్లో పేర్లు మార్పటం వంటి సమస్యలతో అధికంగా అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ శిబిరానికి విశేష స్పందన



జ్యోతి ప్రజ్వలన వెలిగించి క్యాన్సర్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

గుడిపాల: బొమ్మసముద్రం జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్, సరస్వతి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మహిళలకు వచ్చే అనారోగ్య సమస్యలు, క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. దీన్ని బెంగళూరు లయన్స్ క్లబ్ గవర్నర్ భానుమూర్తిరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి వైద్య పరీక్షలు చేసుకొని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. అనంతరం 70 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో సరస్వతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సరస్వతి, అమరనాథరెడ్డి, వైద్యులు యుక్త, చందన, భావ్య, భావన, శ్రీలేఖ, అపర్ణ, శ్రావ్య, పావని సాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా ఆర్‌బీకేలు

నాడు

వ్యవసాయం అంటే ఏటా రైతులకు ఏడాది పొడవునా కష్టాలే ఉండేవి. ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు వచ్చి రోజుల తరబడి వ్యయప్రయాసాలకు ఓర్చి వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరిగి గంటల పాటు క్యూలో నిల్చుని పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఆరుగాలం కష్టపడి పంటలు పండించినా గిట్టుబాటు ధర లభించేది కాదు. యంత్ర పరికరాలన్నీ రైతుల బినామీ పేర్లతో టీడీపీ నాయకులే తీసుకునేవారు.

నేడు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. రైతులు ఇబ్బందులు పడకుండా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్బీకేలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. విత్తు నుంచి విక్రయం వరకూ అన్ని దశల్లో అన్నదాతలకు అండగా నిలబడుతున్నాయి. అన్నదాతలకు అవసరమైన అన్ని రకాల సేవలు రైతు భరోసా కేంద్రాల ద్వారా వారి చెంతకే చేరుతున్నాయి.

- గ్రామాల్లోనే రైతులకు విత్తనాలు, ఎరువులు
- పంటల సాగుకు సూచనలు సలహాలు
- ఈ– క్రాప్ ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ

మండలంలో రైతులకు అందించిన సేవలు

మండలంలో ఆర్బీకేలు–26

రైతుల సంఖ్య	- 12,485
రైతు భరోసా లబ్ధిదారులు	- 12,335,
లబ్ధి	రూ.6.78 కోట్లు
యంత్రపరికరాల లబ్ధిదారులు	- 130
లబ్ధి	రూ.2.25 కోట్లు
ఎరువులు, విత్తనాలు అందుకున్న రైతులు	- 4557

బంగారుపాళెం: రైతన్నల సంక్షేమం, అభ్యున్నతి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాటుపడుతోంది. రైతులకు వెన్నుదన్నుగా రైతు భరోసా కేంద్రాలు నిలుస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించినప్పటి నుంచి రైతులకు అన్నిరకాలుగా సేవలందిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో రైతులు దోపిడీకి గురికాకుండా, అడుగడుగునా రక్షణ కల్పిస్తున్నాయి. నాడు టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయం దండగ అనే పరిస్థితి నుంచి నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో పండగలా మారింది. సీఎం కృషితో అన్నదాతల్లో కొండంత ధైర్యం వచ్చింది.

ఆర్బీకేలలో అందుతున్న సేవలు

- ఖరీఫ్, రబీ సీజన్లలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు రైతులకు పంపిణీ
- పంటకోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనా
- వైఎస్సార్ పొలంబడిలో భాగంగా రైతుల పొలాల వద్దకు వెళ్లి సాగుకు అవసరమైన సలహాలు, సూచనలివ్వడం
- పంటల సాగుకు సంబంధించి ఈ– క్రాప్ నమోదు. దీని ఆధారంగా ప్రకతి వైపరీత్యాలు సంభవించి రైతులు నష్టపోయినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుంది.
- కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా ఐదుగురు సభ్యులతో గ్రూపు ఏర్పాటు చేసి వారికి వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రూ.15 లక్షల విలువ చేసే యంత్ర పరికరాలను 40 శాతం రాయితీతో అందిస్తున్నారు. ఇందులో రైతు వాటా 10 శాతం, మిగతా 50 శాతం బ్యాంకుల ద్వారా రుణం సదుపాయం కల్పిస్తున్నారు.
- ధాన్యపు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు రైతులకు సహకారం.



తిమ్మోజుపల్లెలోని రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు



రైతు పొలంలో మట్టిపరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు



పొలంబడి కార్యక్రమంలో వరి సాగును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఇబ్బందులు తొలిగాయి



రైతు భరోసా కేంద్రాల ద్వారా మాకు అన్ని రకాల సేవలు అందుతున్నాయి. గతంలో ప్రతి సంవత్సరం ఎరువులు, విత్తనాలు కొనుగోలు కోసం మండల కేంద్రానికి కానీ, పట్టణాలకు పట్టణాలకు కానీ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు లేవు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని సకాలంలో అందుతున్నాయి.

- రవీంద్రనాథ్, రైతు, పాలమాకులపల్లె

ఊర్లోనే అన్నీ అందుతున్నాయి



విత్తనాలు, ఎరువుల కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు. అనీ మా ఊరిలోనే అందుతున్నాయి. విత్తనాల కోసం గతంలో చాలా అవస్థలు పడే వాళ్లం. ఇప్పుడు ఉన్న గ్రామంలోనే సులభరీతిలో విత్తనాలు అందిస్తున్నారు. సాగుకు ముందే నగదు రైతుల ఖాతాల్లో జమ చేసి భరోసా కల్పిస్తున్నారు. జగనన్న వ్యవసాయాన్ని పండుగలా మార్చేశారు.

- శ్రీధర్, రైతు, తిమ్మోజుపల్లె

దేశానికే ఆదర్శం ఆర్బీకేలు



రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా రైతులకు గతంలో కంటే ఎంతో మేలు జరుగుతోంది. రైతులకు కావాల్సిన సమాచారం. వ్యవసాయ పరికరాలు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అన్నీ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటున్నాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- రామచంద్రారెడ్డి, చైర్మన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి



చేప పిల్లలను వదులుతున్న పీర్‌సాహెబ్

లార్వాల నిర్మూలనకు చేపపిల్లలు

తవణంపల్లె: దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా నీటి కుంటల్లో గంబూజియా చేప పిల్లలను వదులుతున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి పీర్‌సాహెబ్ తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని జి.గొల్లపల్లె సమీపంలోని నీటి కుంటలో, తవణంపల్లెలోని నీటి కుంటలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీరుసాహెబ్ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలి పెట్టారు. ఈ చేపలు దోమల లార్వాలను తినేస్తాయని దీంతో దోమలు వృద్ధి చెందవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రియాంక, మలేరియా సూపర్‌వైజర్ నారాయణ, ఆరోగ్య కార్యకర్తలు మనోహర్, సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. కానీ సాధారణ దర్శనానికి టికెట్ తప్పనిసరి చేయడంతో కొందరు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ ఈఓ మునిరాజు, వంశపారం పర్య ధర్మకర్త విజయకుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జాతీయ ఇంధన భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను స్థానిక గిరింపేట సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ వారోత్సవాలు సోమవారం నుంచి జూలై 2 వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. ఇంటి నిర్మాణానికి నాణ్యమైన విద్యుత్ పరికరాలను వాడాలని చెప్పారు. తడి చేతులతో, తేమలో ఉన్నప్పుడు విద్యుత్ మోటార్లు, స్విచ్‌లను తాకరాదన్నారు. అవగాహన లేకుండా సొంతంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేయరాదని సూచించారు. విద్యుత్ సమస్యలపై సబ్‌స్టేషన్ కమిటీ సమావేశాలు నిర్వహించి వాటిని పరిష్కరించాలని చెప్పారు. ఇంధన భద్రత మీద అవగాహన కల్పించేందుకు వినియోగదారులకు కరపత్రాలను పంచాలని వివరించారు. కార్యక్రమంలో ఈఈ హరి, పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి, ఏఈ బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ

ఐరాల: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలతోపాటు శుభ్రత తప్పనిసరిగా పాటించాలని అదనపు ఎంఈఓ దామోదర్ నాయుడు సూచించారు. ఆయన సోమ వారం కాణిపాకం ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే ప్రతి విద్యార్థి కడుపు నిండా భోజనం చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోందన్నారు. వంట నిర్వాహకులు ప్రతి రోజు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో అందరికీ వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 55 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఎంపీహెచ్ఈఓ శేషాద్రి, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పనుల పరిశీలన



సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ, అధికారులు

చిత్తూరు అర్బన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నగర కమిషనర్ అరుణ సోమవారం ఉదయం పరిశీలించారు. మురుగానిపల్లి పరిధిలో వారం రోజులుగా కొనసాగుతున్న సిమెంట్ రోడ్డు పనులను కమిషనర్ పరిశీలించి నాణ్యతను తనిఖీ చేశారు. రోడ్డు పనులు జరుగుతున్న తీరుపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అధికారుల పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. రోడ్డు పనులు సోమవారం సాయంత్రానికి పూర్తవుతాయని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అనంతరం గంగినేని చెరువును పరిశీలించారు. గంగినేని చెరువు నుంచి దుర్వాసన వస్తోందని ఫిర్యాదులు రావడంతో, అందులో గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలను తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఎంఈ వెంకట ప్రసాద్, డీఈ రమణ, ఏఈలు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు నగర మేయర్ ఎస్.అముద ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ డేను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఆపస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ప్రతి జిల్లాలో గ్రీవెన్స్ డే ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. ప్రతి నెలా మూడవ శుక్రవారం కలెక్టర్, హెచ్‌వోడీల సమక్షంలో గ్రీవెన్స్ డే ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలను విన్నవించుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. దీని కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడం అభినందనీయమని చెప్పారు.

జగనన్న సురక్షను వినియోగించుకోవాలి



బంగారుపాళెంలో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఉమావాణి

బంగారుపాళెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ ఉమావాణి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డితో కలసి బంగారుపాళెంలో ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు. గ్రామ సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. జూలై 1 నుంచి నాలుగు వారాల పాటు నిర్వహించే కార్యక్రమం ద్వారా మొత్తం 11 రకాల సేవలను అందించనున్నట్లు తెలిపారు. కులం, నివాస, ఆదాయం, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, భూ కొనుగోలు, అనంతరం ఆన్‌లైన్ నమోదు, మార్పులు, చేర్పులు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, కుల గుర్తింపు కార్డులు, రేషన్‌కార్డు వంటి సేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శంకరయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

1నుంచి జగనన్న సురక్ష

గుడిపాల: మండలంలోని అన్ని గ్రామాల్లో జూలై 1 నుంచి 27వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఇందు కోసం ఎంపీడీవో, తహసీల్దార్ రెండు బృందాలుగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. జూలై 1న వసంతాపురం సచివాలయం, 4న నారగల్లు, ఏఎల్‌పురం, 6న బొమ్మసముద్రం, పానాటూరు, 11న చీలాపల్లె, బసవాపల్లె, 13న రామాపురం, నంగమంగళం, 18న రామభద్రాపురం, చిత్తపార, 20న మరకాలకుప్పం, తిమ్మయ్యపల్లె, 25న 189కొత్తపల్లె, పేయనపల్లె, 27న పాపసముద్రం, గుడిపాలలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు



తవణంపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు



యాదమరి : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, అధికారులు

గుడిపాల: మాదక ద్రవ్యాలకు యువత బానిస కాకూడదని సీఎంసీ ఆస్పత్రి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల మార్గరెట్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం సీఎస్ఆర్ కళాశాలలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 1987 నుంచి ప్రతి సంవత్సరం జూన్ 26న మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగానిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలు తీసుకోవడం ద్వారా జ్ఞాపకశక్తి, ఆలోచనలు తమ ఆధీనంలో ఉండవని చెప్పారు. మాదకద్రవ్యాలపై నాటిక ద్వారా, పాటల ద్వారా నర్సింగ్ విద్యార్థులు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు లోకేష్, ప్రిన్సిపాల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ర్యాలీ

యాదమరి: మండల కేంద్రంలో పోలీసులు, అధికారులు మాదకద్రవ్యాలు యువత వాడొద్దని సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఉదయం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎస్ఈబీ ట్రైనీ ఏఈఎస్ శ్రీరామ్, తహసీల్దార్ హనుమంతు, యాదమరి ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీసులు, అధికారులు, ప్రైవేటు కళాశాల విద్యార్థులు యాదమరి మెయిన్ బజారు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీసులు మాట్లాడుతూ జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడమే ముఖ్య ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు మహిళ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తవణంపల్లె: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం తవణంపల్లెలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం టి.పుత్తూరు రోడ్డులో మానవహారం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావద్దు

బంగారుపాళెం: యువత మాదకద్రవ్యాలకు బానిసై బతుకులను నాశనం చేసుకోవద్దని బంగారుపాళెం సీఐ నాగరాజరావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం బంగారుపాళెంలో పోలీసులు, జీఎంఎస్ఏలు, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి జాతీయ రహదారి మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారాన్ని చేపట్టారు. అనంతరం సీఐ మాట్లాడుతూ, సమాజంలో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలకు దూరమై బతుకులను బంగారుబాటగా మలుచుకోవాలని సూచించారు. చదువుపై శ్రద్ధపెట్టి సమాజంలో ఉన్నతంగా జీవించేందుకు కృషి చేయాలన్నారు. ఎస్ఐ రాంభూపాల్ మాట్లాడుతూ, సమాజం అభివృద్ధి సాధించాలంటే చదువుకున్న యువతతోనే సాధ్యమన్నారు. అలాంటి యువత చెడు మార్గాలలో పయనిస్తే ప్రమాదమన్నారు. మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బంగారుపాళెంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : యువత మాదక ద్రవ్యాల బారిన పడకూడదని ఆర్కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు అన్నారు. సోమవారం మిట్టూరులోని ఆ కళాశాలలో సీఎంసీ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల పట్ల కలిగే అనర్థాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సీఎంసీ కళాశాల ప్రిన్సిపల్ నిర్మల మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను సుదీర్ఘంగా వివరించారు. ఈ కార్యకమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.